# పురుష విలాపం

'నే నొక పూల మొక్క కడ...."

"అబ్బ అబ్బ ఎన్నిసార్లు వింటారండీ? ఎప్పుడూ అదే క్యా సెట్ పెడతారు. విసుగు పుట్టదూ మీకు?" అసహనంగా అడిగింది కమల.

"అవును కమలా. అది వింటుంటే నా మనసు పరవశించి పోతుంది. నాకు తెలియకుండానే నాలోఅంతర్లీనంగా ఉన్న భావాలు ఉత్తేజం పొందుతాయి. అందుకే ఆ క్యాసెట్ అంటే నాకంత ఇష్టం చిరునవ్వుతో అన్నాడు.

భర్త వంక అదోలా చూసి నిట్టూర్పు విడిచింది కమల.

"ఈ రోజు మన పెళ్ళి రోజు కదా! గొప్ప వారి భాషలో రజతోత్సవ వివాహవార్షికోత్సవం అవునా?

భర్త మాటలు కొత్తగా వింతగా అనిపించాయి అమెకు.

"ఈ సందర్భంగా నీకు కొన్నివాస్తవాలు చెప్పాలను కుం టున్నాను. కమలా. నిజానికి ఇన్నాళ్ళా నీకు చెప్పకపోవటం ద్రోహమే కావచ్చు కానీ నన్ను మాత్రం అపార్థం చేసుకోకు. నాకు ఇప్పటి వరకు వచ్చిన కొన్ని వందల ఉత్తరాల్లో ఓ అయిదారు

ఉత్తరాల్ని భద్రంగా దాచుకున్నాను. ఎందుకో అవి జీవిత సత్యాన్ని చెప్పేవిగా అనిపించాయి. నాకు అందులోనూ మగవాడి జీవితానికి దర్పణం పట్టాయా అనిపించాయి, వాటిల్లో కొన్ని నీకు కష్టం కలిగిస్తాయేమో ! కాని నీకు ఇవ్వాలను కుంటున్నది నిన్ను నొప్పించాలని మాత్రం కాదు. వాటిల్లోని వాస్తవాల్ని నీవు అర్థం చేసుకుంటావని, చేసుకోవాలనీ ఇస్తున్నాను.

"అ వుత్తరాలన్నీ నేను ఎన్నో సార్లు చదువుకున్నాను. మనసు బాగుండక పోతే సాధారణంగా నేను చేసే పని అదే. అశాంతిగా ఉన్న నా మనసుకు ప్రశాంతత చేకూరుతుంది వాటిని చదువుతుంటే. త్వరగా పని పూర్తిచేసుకొనిరా" అంటూ భోజనం పూర్తి చేసి పడక గదిలోకి నడిచాడు.

త్వరత్వరగా వంట ఇంటి పని ముగించుకుని కొత్త ఉత్సాహంగా భర్త దగ్గరకువెళ్ళి ప్రక్కనే కూర్చున్నది కమల. ఒక్కొక్క ఉత్తరమే ఆమెకిస్తూ పెద్దగా చదవ మన్నాడు.

"ప్రియమైన రాముకి,

నేను పుట్టి పెరిగిన ఊరికి-నన్ను పెంచిన మనుమల మధ్యకు నువ్వు వెళ్ళినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. అయితే ఆనాడు నేను పెరిగిన పరిస్థితులు వేరు నువ్వు పెరిగిన పరిస్థితులు వేరు నేను లేమిడితో చాలా బాధలు పడ్డాను. నీకా అవసరంలేదు. నువ్వు నేను కోరుకునే విధంగా, అందరూ మెచ్చుకునే విధంగా గొప్ప వాడిని అయ్యేందుకు కృషిచేస్తావని నమ్ముతున్నాను.

గుంటూరు చాలా మంచి ఊరు. చదువులకు నిలయం· సంస్కృతికి కేంద్రం, అక్కడ జరిగే సంగీత కచేరీలు, సాంస్కృ

తిక కార్యక్రమాలు వింటుంటే, చూస్తుంటే మానసికంగా ఎంతో అభివృద్ధి సాధించవచ్చును. అక్కడ మనకు అటువంటి కార్యక్రమాలకు వెళ్ళడం వల్ల ఎంతో జ్ఞానం సంపాదించుకోవచ్చు. అల్లరిచిల్లరగా తిరుగుతూనే నేను అలాంటి జ్ఞానాన్ని కొంతైనా సంపాదించుకోగలిగాను. నువ్వు బుద్ధి మంతుడిగా, ఆ వాతావరణంలో కావలసినంత ప్రయోజనం పొందుతావని ఆశిస్తున్నాను.

మా నలుగురి పిల్లల్లోకీ నీలో ఒక ప్రత్యేకత ఉంది. నీకు ప్రేమించడం ఎక్కువగా తెలుసు అలాగే ప్రేమను నీవు ఎక్కువగా కోరుతావు. తల్లిదండ్రులకు పిల్లల మీద సహజంగానే ప్రేమ ఉంటుంది. నువ్వు మేము ప్రేమిస్తున్నదానికంటే ఎక్కువకావాలని కోరుతున్నావని నాకు తెలుసు దూరంగా ఉంచటం నాకూ మీ అమ్మకూ కూడా ఇష్టం లేదు. అయినా మంచి కోసం కొన్ని త్యాగాలు చేయాలి. ఇప్పుడు నిన్ను దూరంగా పంపటం ద్వారా నేను చేసిందదే అనుకుంటున్నాను. మా పిల్లలు మాకళ్ళ ముందు తిరుగుతుండాలనే మా కోరిక. అదే మాకు తృప్తి కాని మీరు మరింత తెలివిగల వారుగా, ప్రయోజకులుగా మాతో ఉంటే గర్వంతో కూడిన సంతోషం కలుగుతుంది. అది పొందేందుకే నిన్ను గుంటూరు పంపింది. నిన్నుచూసి గర్వంతో ఆనందించాలనే నా కోరిక. అది తీరుస్తావని నమ్ముతున్నాను.

నువ్వు అక్కడ ఏ కొరతను అనుభవించకూడదు. అలా నీవు ఉండేటట్లు చూడటం నా ప్రియమైన కర్తవ్యం. నీకు ఏది కావలసినా ఇచ్చేందుకు నాకు శక్తి ఉంది. ఇస్తాను.

నీవు అత్తయ్యగారింట్లో పెదనాన్నగారింట్లో నీ యిష్టమొచ్చిన చోట ఉండు. రెండూ మన ఇళ్ళే, పెద్ద నాన్న నాకు

అన్నయ్య అత్తయ్య నాకు అక్కయ్య. అలాగే అందరూ మన వాళ్లే నాతో సమానమైన వాళ్లే.

గుంటూరు ప్రయాణానికి నీవు దిగులు ముఖంతో తయారు కావటం క్షణక్షణం నాకు జ్ఞాపకం వస్తుంది. నిన్ను చూసే వరకు ఆ జ్ఞాపకాల తీపి బాధ నా మనసులో గూడుకట్టుకొనే ఉంటుంది.

నిన్ను బస్సు ఎక్కించి ఇంటికి వచ్చాను. నేను దగ్గర కూర్చోబెట్టుకొని చదువు చెప్పి ఉంటే నిన్ను గుంటూరు పంపవలసిన అవసరం ఉండేది కాదనీ, నీవు ఊర్కెంది కేవలం నా అశ్రద్ధ వల్లనే నని మీ అమ్మ కన్నీళ్ళతో నన్ను తప్పులు పట్టింది. నీ సబ్జక్టులు నాకు రావని నీకు తెలుసు. మీ అమ్మకు తెలీదు. మాతృ ప్రేమ ఆమె నలా మాట్లాడించింది. నా మాట కాదనలేక నీ ప్రయాణానికి ఆమె అభ్యంతరం చెప్పలేదు. కానీ నీవు ఊరు వెళ్ళటం ఆమెకు ఏ మాత్రం ఇష్టం లేదు.

ఏది ఎందుకు జరుగుతుందో ఎవరికీ తెలియదు. గుంటూరు వాతావరణంలో రూపుదిద్దుకొనే అదృష్టం నీకున్నది. దాన్ని ఎవ రాపగలరు ?

నువ్వు భయపడవద్దు. భయానికి మరోపేరు దిగులు. ఈ రెండూ వద్దు. ధైర్యంగా ఉండాలి. మంచివాళ్ళతో స్నేహం చెయ్యి మంచివాడి వనిపించుకో. నా ఆశయం నెరవేర్చు.

నీవు క్షేమంగా చేరినట్లు రేపు ఉత్తరం అందుకుంటా నను కుంటాను. తరుచుగా ఉత్తరాలు రాస్తుండు. మాకు సంతోషంగా ఉంటుంది.

అందరినీ అడిగినట్లు చెప్పు.

మీ నాన్న"

"అమ్మ నాన్నల దగ్గర గారాబం ఎక్కువై సరిగా చదవటం లేదని పెదనాన్నగారి దగ్గరకు పంపాడు నన్ను నాన్న. నన్ను పంపిన మూడవ రోజే నాన్న దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం అది.

ఆయన కోరిక ప్రకారం ప్రారంభంలో శ్రద్ధగానే చదువుకున్నాను. ఇంటర్మీడియట్ మంచి మార్కులతో పాసయ్యాను. డిగ్రీలో చేరాక నాకు లత అనే అమ్మాయితో పరిచయం అయింది. మా పరిచయం కొద్దికాలానికే ప్రేమగా మారింది. ఆమె గుంటూరుకు దగ్గర్లోనే మరో ఊళ్ళో చదువుకుంటూ, హాస్టల్లో ఉంటుంది.

ప్రతి ఆదివారం ఆమె దగ్గరకు వెళ్ళేవాడిని. ఒకరిని ఒకరం చూసుకోకపోతే ఉండలేనంతగా మారింది మా పరిస్థితి. ఆమెను పిచ్చిగా ప్రేమించాను. ప్రతిక్షణం ఆమెను గురించిన ఆలోచనతోనే కాలం గడిచిపోయేది నాకు ఎప్పుడెప్పుడు ఆదివారం వస్తుందా అని ఎదురు చూడటంతోనే సరిపోయేది.

"ఆమె ధ్యాసలో చదువు వెనకపడింది. ఆమెను నా దాన్ని చేసుకోవాలనే బలమైన కోరిక నా నరనరాల్లోనూ జీర్ణించుకుపోయింది. తను లేనిదే నాకు జీవితం లేదనే స్థితికి వచ్చాను. వారానికి రెండు, మూడు ఉత్తరాలు రాసుకునే వాళ్ళం. తన ప్రతి ఉత్తరం నన్ను ఆమెకు మరింత దగ్గరయ్యేందుకు దోహదం చేసేది. అలాంటి కొన్ని వందల ఉత్తరాల్లో ఒక్కటి చదువు."

"మైడియర్ రాము,

నిన్న ఆదివారం తప్పకుండా వస్తానని ఎంతో ఆశగా ఎదురు చూశాను. ఎందుకు రాలేదు. ? ఎంతగా డిజపాయింట్ అయ్యానో

తెలుసా ? నిన్ను చూడకుండా మాత్రం నేను ఉండలేను. రోజూ కలుసుకునేందుకు ఎటూ వీలులేదు. కనీసం ఆదివారమైనా నీవు రాకపోతే నేను ఏమైపోవాలనుకున్నావు ?

పోయినసారి ఉత్తరంలో 'ఇప్పటికిప్పుడు నేను నీ మెడలో పసుపుతాడు కడితే కట్టించుకోగలవా ? అని రాశావు. ఈ క్షణంలో నీవు పసుపుతాడు కడతానంటే నేను సిద్ధంగా ఉన్నాను. నీకు ఆ అనుమానమే వద్దు· నీకోసం ఎవరినైనా వదులుకోవడానికి వెనుకాడను. మా అమ్మ, నాన్న, అక్కలు, అన్నయ్య ఎవరైనా నీ తరువాతే. ఒక్కటి మాత్రం గుర్తుపెట్టుకో. ఆడది జీవితంలో ఒక్కరిని మాత్రమే ప్రేమిస్తుంది.

లక్షల గురించి ఓ మాటరాశావు. ఆ లక్షల గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు, ఆలోచించను. నన్ను ఇదేనా అర్థం చేసుకున్నది ? అన్నిటికన్నా విలువైన నీమంచి మనసు నాకు కావాలి. ఏ ఆడదైనా తనను దేవతలా, కంటికి రెప్పలా చూచుకొనే భర్తకన్నా కోరుకునేది ఏదీ ఉండదు. నన్నలా చూచుకొనే నీకంటే నాకు కావలసింది ఏముంటుంది ?

ఏ నాటికైనా నేను నీదాననే. నీవు నా వాడవే. మన ఇద్దరిని ఎవ్వరూ విడదీయలేరు మా నాన్న కున్న లక్షలు మనకు అడ్డురావు నా మనసు ఎప్పుడు మార్చుకుంటానో నన్న భయం నీలో కనిపిస్తున్నది· అది మాత్రం ఎప్పటికీ జరగదు. నా ప్రాణమైనా వదులుకుంటాను. గాని, నీకు దూరంగా, మరొకరి సొంతమై బ్రతకటం జరగని పని.

ఈసారి ఆదివారం తప్పకుండా రా ! నిన్ను చూడకపోతే పిచ్చెక్కినట్లుంది. పరీక్షలు కూడా దగ్గరలోకి వచ్చాయి. నిన్ను

చూస్తే గాని మనసు కుదుట పడదు. అప్పుడుగాని కాస్తో కూస్తో శ్రద్ధగా చదువుకోలేను.

నీ కోసం ఎదురు చూస్తూ

నీ లత"

"ఆరుసంవత్సరాలు ఆ విధంగా ఆమెను పిచ్చిగా ప్రేమించాను. అంతకాలం పెళ్ళి చేసుకోకుండా ఉండటానిక్కారణం నా చదువు పూర్తికాక కొనాళ్ళు, అయ్యాక ఉద్యోగం లేదని మరి కొనాళ్ళు. అలా అలా ఆమె నామస్మరణంలో, ఆమె ధ్యాసలోనే రోజులు గడుపుతున్న నాకు, ఓ రోజు ఆమె నుంచి ఆఖరి ఉత్తరం వచ్చింది. క్లుప్తంగా దాని సారాంశం ఇది.

"మా ప్రేమ విషయం వాళ్ళ వాళ్ళకి చెప్పిందట. అది వినగానే వాళ్ళ నాన్నకు హార్ట్‌ఎటాక్ వచ్చినదట. వాళ్ళ వాళ్ళందరూ తనను నానా మాటలు అన్నారట. ఎలాగో తన తండ్రి కోలుకున్నాడట. దగ్గరకు పిలిచి ఆమెను ఏవేవో చెప్పితన దగ్గర మాట తీసుకున్నాడట ఆయన ఇష్టప్రకారంవాళ్ళ అత్తకొడుకుని చేసుకుంటానని తలాడించిందట. నేను చేసింది. చాలా ఘోరమైన పనే కాదనను కాని కనిపెంచిన అమ్మ నాన్నలను..." అంటూ ఏవోరాసింది.

అంతే నాకు స్త్రీ జాతిమీద అసహ్యం వేసింది. ఆమె ప్రభావం నామీద చాలా బలంగా పని చేసింది. ఆడదాని ప్రేమ అంతే ననిపించింది. నన్ను అంత తేలికగా వదులుకోగలిగిన మనిషి కోసం నేనెందుకు తాపత్రయం పడాలి? అనుకున్నాను.

ఆ తరువాత కొంత కాలానికి మన పెళ్ళి జరిగింది. పాపం నీ కింతవరకూ ఈ విషయం తెలియదు. కదూ! సహజంగా ఆత్తా

కోడళ్ళ మధ్య వచ్చే మనఃస్పర్థలు కీచులాటలూ మన ఇంట్లో కూడ ప్రవేశించాయి. నిన్నూ, నన్నూ, మా అమ్మ నాన్నలనూ సమాధాన పరచటానికి మా అక్క చాలా శ్రమపడింది.

"ఓ రోజు మీ నాన్న మన ఇంటికి వచ్చినప్పుడు నిన్ను మేమంతా సరిగా చూచుకోవటం లేదని అమాయకులైన అమ్మా నాన్నలతో తగూలాడిన విషయం నీకు గుర్తే ఉంటుంది. అప్పుడు మా అక్కకూడా మన ఇంట్లోనే ఉంది. ఆ తరువాత మా అక్క నాకు రాసిన ఉత్తరం చదువు."

"ప్రియమైన తమ్ముడికి,

ఈ ఉత్తరం పూర్తిగా చదివి నన్ను సరిగా అర్థం చేసు కుంటా వనుకుంటాను.

మనం చరిత్ర ఎందుకు చదువుతాం ? పూర్వపు అధికారులు ఎంత మంచిగా, ఎంత బాధ్యతాయుతంగా ప్రవర్తించి ప్రజల విశ్వా సాన్ని చూరగొని దేశాన్ని ఏ విధంగా తీర్చిదిద్దారు ? ఏయే తొంద రపాటు పనులు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టి వాళ్ళ అవమానాలకు గురై దేశాన్ని ఏ విధంగా ఛిన్నా భిన్నం చేశారు ? తెలుసుకొని మనం ఏ రకంగా ప్రవర్తించాలి ? అనేది తెలుసుకోవాలనే ఉద్దే శంతో చదువుతాం, చదవాలికూడా.

అలాగే రాజకీయ శాస్త్రం కూడా. ఎప్పుడు ఏయే చట్టాలు—శాసనాలు ప్రజల్లో ఏ విధమైన మార్పులను తెచ్చాయి ? ఏయే పరి స్థితుల్లో ఏయే చట్టాలు శాసనాలు ఎటువంటి ఫలితాల నిచ్చాయి, అనేవి తెలుసుకునేందుకు చదవాలి.

అదే విధంగా నేను రాసే విషయాలనూ, వాటిలోని నిజా

నిజాలను ఆలోచించి, దానికి అనుగుణంగా ప్రవర్తించాలనే కోరికతో, ప్రవర్తిస్తావనే నమ్మకంతో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

నా కంటెచిన్న వాడివి కనుకా, అందునా నేను ఆడపిల్లను కనుకా చెపుతున్నాను. నా హద్దుల్లో నేనుండి పైపై పలకరింపులతో కాలం గడపాలని నాకు లేదు. అయినా, నేను హద్దు మీరుతున్నానని అనుకోవటం లేదు. ఎప్పటికైనా నీ కష్టం, సుఖం, సంతోషం, గౌరవం, మర్యాద, ప్రేమ అన్నింటిలో నా కూ్కడా భాగం ఉంటుం దనే అనుకుంటాను. ఉండాలనే కోరుకుంటాను.

నీ భార్య విషయం—

నీవు ఉదయాన్నే భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళగానే తనూ భోజనం చేసి వెళ్ళి గదిలో పడుకుంటుందట మళ్ళీ నీవు వచ్చే సమయానికి లేచి అమ్మతో మాట్లాడటం చేస్తుందట. అమ్మ బాధపడుతూ నాకు చెప్పిన మాట లివి. కేవలం పనికోసం దాన్ని తన కోడలుగా చేసుకోలేదు. తమ్ముడి కూతురని తనతో కలసి మెలసి చనువుగా, ప్రేమగా ఉంటుందనే ఆశతో అమ్మ మేనకోడలిని కోడలుగా చేసుకుంది.

తనకు ఏమీ తెలియదనే నీ వాదనలో పూర్తిగా నిజం లేదు మాటలతో చెప్ప వీలుకాని విధంగా దాని ప్రవర్తన పూర్తిగా మారింది. పెళ్ళికాక ముందు నాతో చూపించిన చనువు, ఆప్యాయతల్లో నూరవవంతు కూడా ఇప్పుడు తనకు లేవు. ఇది కేవలం నా స్వానుభవం. తనలో మనుషులను లెక్కచేయని నిర్లక్ష్య వైఖరి కనిపిస్తూంది.

తనకు అందరికంటే ముఖ్యమైన వాడివి నువ్వు కాదనను. కానీ నీతృప్తి కోసం నీ మంచితనాన్ని పెంచటం కోసం నీ వాళ్ళం

దరిని కూడా ఆదరణంగా చూడాలి· ముఖ్యంగా అమ్మా నాన్నలను.

ఏ ఇంటి కోడలైనా పెద్దవాళ్ళను ఆదరణతో తృప్తిపరచాలి. తనతో సమానమైన వాళ్ళతో స్నేహంగా ఉండాలి· చిన్నవాళ్ళను ప్రేమించాలి, లాలించాలి· అప్పుడే ఆ ఇల్లు ప్రశాంతంగా హాయిగా ఉంటుంది.

రెండు కత్తులు ఒకే వరలో ఇమడవన్న సామెతగా పెళ్ళి చేసుకోవటం తప్పయిందని బాధపడుతున్నావేమో ! కాదు అలా అనుకోవద్దు. మా కోసం నీ భార్యను హీనంగా చూడవద్దు. తన కోసం మమ్మల్ని వదులుకోనూ అక్కరలేదు.

ఆడవాళ్ళ పాలటిక్స్ వేరు· ముఖ్యంగా అత్తాకోడళ్ళకీ వదినా మరదళ్ళకీ వచ్చే తగాదాలకు మూలకారణం ఆ ఇద్దరికీ ఒకే మగ వాడి మీద ఉన్న ప్రేమ. ఓ పక్క తల్లిప్రేమ, మరో పక్క భార్య ప్రేమ. ఇద్దరూ ఆ మనిషిని ప్రేమిస్తూనే తమకి తెలియకుండానే అతణ్ణి ఇబ్బంది పెడుతుంటారు.

అమ్మా నాన్న ఎన్నో కష్టాలు పడి మన ఇద్దరి సంతోషాన్ని కొనుక్కొన్నారు. పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు తండ్రి హెూదానుబట్టి పిల్లలకు గుర్తింపు ఉంటుంది. అలాగే వృద్ధాప్యంలో పిల్లల హెూదాను బట్టి తల్లిదండ్రులకు గుర్తింపు వస్తుంది.

నాన్న నీ గురించి చాలాసార్లు నా దగ్గర చెప్పుకుని బాధ పడ్డాడు. నీవు తనతో మాట్లాడవని, ఆయనతో మాట్లాడటానికి నీకు విసుగని అనుకున్నాడు. ఏది అంతగా పట్టించుకోకపోవటం. నీ స్వభావం అని తనకు తనే సమాధాన పడేవాడు.

పెద్దవాళ్ళకు వయసు పెరిగే కొద్దీ తమకు తెలియకుండానే మృత్యుభయం పెరుగుతుందట. శరీరంలో శక్తి తగ్గిపోతుంది. పూర్తిగా ఇతరుల మీద ఆధారపడతారు. అలా ఆధారపడవలసి వచ్చిందే అన్న భావన వాళ్ళను మానసికంగా మరింత క్రుంగదీస్తుంది. నాన్నతో నీవు రాజకీయాలు మాట్లాడకపోవచ్చు. జోక్స్ కట్ చేయలేకపోవచ్చు. ఆయన వ్యక్తిగత విషయాల్లో, ఆరోగ్య విషయంలో, నిత్యకృత్యాల విషయంలో నీవు శ్రద్ధ తీసుకుంటే ఆయన కెంతో తృప్తి. మన తల్లిదండ్రులు, భార్యా బిడ్డలు ఎవరైనా సరే చిన్న చిన్న విషయాల్ని ముచ్చటించటంవల్ల వాళ్ళు పొందే తృప్తి విలువ కట్టలేనిది. ప్రయత్నించిచూడు. మన ఉనికి వల్ల, మన మాటలవల్ల సంతోషపడగలిగే వాళ్ళని తృప్తిపరచడం చాలా తేలిక.

అమ్మా నాన్న మనమీద డమ్ముడు ప్రేమను కుమ్మరించారు. కనీసం గ్లాసెడు ప్రేమనందించటం మన విధి.

ఈ ఉత్తరంలో నేను నీకు చెప్పిన విషయాలు ఎక్కువగా ఉన్నా, నీకు బాధ కలిగించినా, నేను నీకు అప్పగించిన డ్యూటీ మాత్రం చాలా చిన్నది. అయినా, ఎంతో ముఖ్యమైనది.

ఈ రకంగా ఆలోచిస్తేసమాజంలో అందరికీ ప్రేమని పంచి ఇచ్చే వ్యక్తిగా, భిన్న స్వభావాలకు సారధిగా వ్యవహరించే మగవాడి బతుకు చాలా బాధ్యతాయుతమైనది అనిపిస్తున్నది. కదూ !

మనుషుల మధ్య సంబంధాలు తెంచుకున్నంత తేలికకాదు పెంచుకోవటం ! పెంచుకోవాలేగాని తెంచుకోకూడదు. నీ భార్యను మర్యాద, మన్నన ప్రేమ, అనురాగం నేర్చుకోమను. అందర్నీ గౌరవించటం తెలుసుకోమను. ప్రేమించటం, ప్రేమింపబడటం

ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటుందనే విషయం గ్రహించ మను.

అమ్మా నాన్నల గౌరవం, అగౌరవం, సుఖం, దుఃఖమూ— వాళ్ళ జీవితశేషాలూ, వాళ్ళవల్ల పుట్టి పెరిగి, నీదిగా జీవితాన్ని దిద్దు కునే నీ వ్యక్తిత్వంలో ఇమిడి ఉన్నాయి. కొడుకుగా వాళ్ళను తృప్తి పరచగలవని ఆశిస్తున్నాను.

అనుకూలమైన భర్తగా, ప్రేమని అందిచే తండ్రిగా, విశ్వాస పాత్రమైన కొడుకుగా, కష్టసుఖాల్లో కూడా నాకు తోడుగా ఉండా అని దీవిస్తూ ఇంత పెద్ద బాధ్యతలు నీ మీద పెట్టిన దేవుడే నీకు వీటన్నిటినీ నేర్పుతో నిర్వహించగల శక్తినీ, మనోధైర్యాన్నీ కలి గించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఇక ముగిస్తున్నాను.

ప్రేమతో
నీ అక్క"

ఆ తరువాత ఓనాడు మా అమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోతే ఆమె కేదో చేయమంటూ నీకు పని పురమాయించాను. ఏ కారణం గానో నీవు విసుక్కున్నావు. అది నా చెవుల పడింది. నిన్ను నానా మాటలు అన్నాను.

ఆ రోజు మన ఇద్దరికీ చాలా పెద్ద ఘర్షణే జరిగింది. నీకూ గుర్తేకదూ ? తన మూలంగా మన ఇద్దరం అలా ఘర్షణ పడటం అమ్మకు మనఃస్తాపం కలిగించింది.

ఆ రోజు మొదలు నాతో ఓ నెల రోజులు మాట్లాడకుండా నన్ను సాధించావు. నేనూ పంతంగా అలాగే ఉండిపోయాను.

పిల్లలిద్దర్నీ తీసుకొని పుట్టింటికి వెళ్ళి నాకు ఓ వుత్తరం రాశావు గుర్తుందా ? అది కూడా చదువు."

"శ్రీవారికి,

కమల నమస్కరించి వ్రాయునది. నేను పిల్లలు క్షేమము. మీరు కులాసా అనుకుంటాను. నేను ముఖతా చెప్పలేని కొన్ని విషయాలను మీకు చెప్పాలని ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నేను మీ మీద అలిగి మాత్రం రాలేదు. మా అమ్మా నాన్నలకు అసలు మన మధ్య జరిగిన విషయాలేవీ చెప్పలేదు. మీకు ఆఫీసుకు సంబంధించి ఏవో పరీక్ష లున్నాయని, పిల్లల గొడవ లేకుండా ఉండేదుకు వచ్చానని చెప్పాను.

ఇకపోతే ప్రతి ఆడది కోరుకునేది భర్త అనురాగం, ఆప్యాయత. అవి లేనప్పుడు భర్త ఎంత సంపాదిస్తున్నా ఆ సంపాదనకు విలువ. గుర్తింపు ఉండవు. అలాగే బాధ్యతలులేని హక్కులకు ఏ విధంగా గౌరవం ఉండదో, హక్కులులేని బాధ్యతల క్కూడా అదే విధంగా గౌరవం ఉండదు.

మీ అమ్మా నాన్నలను సంతోష పెట్టడం, సుఖ పెట్టటం మీ కనీస ధర్మం అన్నారు. కట్టుకున్న దాన్ని కూడా సంతోషపెట్టటం భర్తగా మీ విధి కాదా ? ఆ విధంగా ఎప్పుడైనా ఆలోచించారా ? నా స్థానంలో మీ అక్క ఉంటే మీరెలా ఫీలయ్యేవారు ? ఒక్క క్షణం ఆలోచించండి.

నేను ఎప్పుడైనా మనసులో మాట చెప్పుకుంటే నీకేం లోటు చేస్తున్నాను ? అంటుంటారు. మనిషికి బ్రతకటానికి కావలసినవి మూడే మూడు. తిండి, బట్ట, కొంప వీటికి నాకేమాత్రం లోటులేదు.

చాలామంది కంటే హాయిగా ఉంటున్నాను. లోటంతా నా మనసుకే పరిమితం. ఆ లోటును భర్తీ చేయడం మీ ఒక్కరికే సాధ్యం. అది మాటలతో చెప్పలేనిది. అనురాగంతో కూడిన మీ మాటలతో పొంగిపోయే అల్ప సంతోషిని. ఆ మాటలే కరువైపోవడం నా దుర దృష్టం అనుకుంటున్నాను. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. మన ఇద్దరి ప్రవర్తనా తప్పక వాళ్ళమీద ప్రభావం చూపుతుంది. ఏది ఏమైనా ఒకే మార్గాన ఆలోచించే మీ మనోధర్మం మారాలి. ప్రస్తుతం ఉన్న వాతవరణంలో నేను ఇమడలేనేమో ! సహృదయంతో అర్థం చేసుకోగలరు. ఉంటాను.

మీ శ్రీమతి."

ఉత్తరాలన్నీ చదవడం పూర్తయింది.

ఇవన్నీ చదువుతుంటే నా కేమనిపిస్తుందో తెలుసా ? ప్రతి మగవాడికి జీవితంమీద ఓ ఆడదాని ప్రభావం తప్పకుండా ఉంటుం దనిపిస్తుంది. అర్ధరాత్రి ఒంటరిగా రోడ్డుమీద నడవటానికి స్వాతంత్ర్యం లేదని వాపోతున్న ఆడవారికి మగవాడికి ఇన్ని బాధ్యత లున్నాయని తెలియదేమో అనిపిస్తుంది. అయినా ఈరోజుల్లో మగ వాడు మాత్రం అర్ధరాత్రి ఒంటరిగా ఏం ఖర్మ, జంటగా అయినా సరే స్వేచ్ఛగా తిరగగలుగుతున్నాడా?

"అలాగని ఆడవాళ్ళకి అన్యాయం జరగటం లేదని కాదు నా ఉద్దేశం. కానీ, ఇటీవల ఏ సినిమా చూసినా ఏ నవల చదివినా మగ వాళ్ళంత నీచులుగానూ, ఆడవాళ్ళందరికీ అన్యాయం జరుగుతు న్నట్లుగానూ చిత్రీకరించటం జరుగుతూంది. అది మాత్రం అన్యాయం అసలు ఆడవాళ్ళకు జరిగే అన్యాయాల్లో ఎక్కువ భాగం ఆడ

వారి వల్లనే జరుగున్నాయనే నిజాన్ని ఎంతమంది ఒప్పుకోగల రంటావ్ ?

"సృష్టిపరంగానే ఆడ మగలకు ఎవరి బాధ్యతలు వాళ్ళకు విభజించటం జరిగింది. వారి వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం జరిగితే కలతలకూ, కల్లోలాలకు అవకాశం ఎక్కడిది ?

భర్త అభిప్రాయాలతో తనూ ఏకీభవించినట్లుగా కళ్ళతోనే భర్తకు సమాధానం చెప్పిన కమల ఆత్మీయంగా అతని నుదురు ముద్దాడింది.

టేప్‌రికార్డర్ ఇంకా విలపిస్తూనే ఉంది.

'మావెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ జీవితమెల్ల మీకై త్యజించి కృశించి, నశించిపోవును గదా ! అకటా ఎంతటి దయలేనివారు మీ ఆడువారు!' ○

(ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక ది. 27-8-86)